సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం ׀ 17 ׀ జనవరి ׀ 2025



సోమశిలలో 70.07 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం సాయంత్రానికి 70.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 1933 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.81,660
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,410
3 శాతం జీఎస్టీతో	రూ.7,632
నవర (8 గ్రా)	రూ.61,056

గరిష్టం/కనిష్టం
30.4 /23.7

వాతావరణం

జిల్లాలో వాతావరణం శుక్రవారం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 70 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

కుష్టు వ్యాధిపై 20 నుంచి ఇంటింటి సర్వే



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు (అర్బన్): కుష్టు వ్యాధిపై జిల్లాలో ఈ నెల 20 నుంచి వచ్చే నెల రెండు వరకు ఇంటింటి సర్వేను నిర్వహించనున్నామని లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. నెల్లూరు కపాడిపాళెంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏఎన్ఎంలకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్వేను పక్కాగా నిర్వహించాలని సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయొచ్చని చెప్పారు. వ్యాధికి సంబంధించిన మందులు ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆశ కార్యకర్త, పురుష వలంటీర్ ప్రతి ఇంటికీ వెళ్లి సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. జేఎన్నార్ కాలనీ మెడికల్ ఆఫీసర్లు మానస, పర్వీన్, కల్యాణి, సీఓ విజయలక్ష్మి, డీపీఎంఓలు సుబ్బయ్య, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు (టౌన్): నగరంలోని రవాణా శాఖ జిల్లా కార్యాలయంలో రహదారి భద్రత పోస్టర్లను ఆవిష్కరించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి డీటీసీ సిరి చందన మాట్లాడారు. కార్యక్రమాన్ని జిల్లాలో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 15 వరకు నిర్వహించనున్నామని వివరించారు. రహదారి ప్రమాదాలు, నిబంధనలు తదితరాలపై వాహనదారులకు అవగాహన కల్పించనున్నామని చెప్పారు. ఎంవీఐలు బాల మురళీకృష్ణ, రఫీ, ఏఎంవీఐలు స్వప్నిల్‌కుమార్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, ఏఓ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మంత్రి పర్యటన

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర రవాణా, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి జిల్లాలో శుక్ర, శనివారాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ డీడీ సదారావు గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పది మందికి గాయాలు



మర్రిపాడు: ప్రభుత్వ భూమి విషయమై ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పది మంది గాయపడిన ఘటన మండల పరిధిలోని నాగినేనిగుంట పంచాయతీలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని బాటలో 332 సర్వే నంబర్‌లో 345.30 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో జరిగిన భూ పంపిణీలో తనకు పట్టా ఇచ్చారని తుపాకుల ధనమ్మ చెప్తున్నారు. ఈ క్రమంలో ఈటె వెంకటయ్య వర్గం వారు ఈ పొలాన్ని ట్రాక్టర్‌తో రెండు రోజుల క్రితం చదును చేశారు. తాజాగా తుపాకుల ధనమ్మ వర్గం వారు జామాయిల్ మొక్కలను గురువారం నాటుతుండగా, వెంకటయ్య తన వర్గంతో అక్కడికి వెళ్లారు. వీరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఘటనలో వెంకటసుబ్బయ్య, సురేంద్ర, నరేష్, రామకృష్ణ, వెంకటకృష్ణ, రమణయ్య, రమేష్, హరిబాబు, వెంకటయ్య, రమేష్ గాయపడ్డారు. కాగా ఈ అంశమై ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్‌యాదవ్‌ను సంప్రదించగా, సంబంధిత భూమిని పరిశీలించి చర్యలు చేపడతామని బదులిచ్చారు.

అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ల నిలిపివేత

నెల్లూరు సిటీ: అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లను రెండు నెలల పాటు చేయొద్దంటూ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి సిసోదియా ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు.



అశేష ప్రజానీకంతో కిక్కిరిసిన పినాకినీ తీరం

వైభవంగా ఏటి పండగ





సింహపురిలో సందడే సందడి

- భక్తజనసంద్రం.. పినాకినీ తీరం
- భక్తిశ్రద్ధలతో గొబ్బెమ్మల నిమజ్జనం
- ఆటపాటలతో కోలాహలం

నెల్లూరు(బృందావనం): సంక్రాంతి సంబరాల్లో చివరిదైన ఏటి పండగతో నెల్లూరు నగరంలోని పవిత్ర పినాకినీ తీరం గురువారం జనసంద్రంగా మారింది. గొబ్బియలో.. గొబ్బియలో.. సంక్రాంతి పండగొచ్చె గొబ్బియలో అనే గీతాలు.. పతంగులను ఎగురవేస్తూ యువత.. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి వాతావరణం నెలకొంది. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఈ ప్రాంతం కోలాహలంగా మారింది.

భారీగా రాక

ధనుర్మాసంలో తమ ఇళ్లలో భక్తిశ్రద్ధలతో పూజించిన గొబ్బెమ్మలను ఊరేగింపుగా పవిత్ర పినాకినీ తీరానికి మహిళలు తీసుకొచ్చారు. సుఖసంతోషాలు, అష్టఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని.. కుటుంబాలను దీవించాలని గౌరమ్మ తల్లిని వేడుకుంటూ పినాకిని తీరంలో నిమజ్జనం చేశారు. ఒకరికొకరు కుంకుమ, బొట్లు పెట్టుకుంటూ.. పసుపు, కుంకుమ, గాజులను గంగమ్మ తల్లికి సమర్పించారు. పిండి వంటలను ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుంటూ.. నదీతీరాన ఉన్న తినుబండారాలను అల్పాహారంగా సేవిస్తూ ఉత్సాహంగా గడిపారు.

కొలువైన దేవతామూర్తులు

జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దేవతామూర్తులు పినాకినీ తీరానికి తరలివచ్చి భక్తులను అనుగ్రహించారు. గణనాథుడు, ఇరుకళల పరమేశ్వరి, రాజరాజేశ్వరి అమ్మవారు, తల్పగిరి రంగనాథుడు, మూలస్థానేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, ధర్మరాజస్వామి, వేదగిరి లక్ష్మీనృసింహుడు, జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారు, నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారు కొలువై భక్తులను కటాక్షించారు. విశేష పుష్పాలంకారంలో నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. దర్శనానికి భక్తులు బారులుదీరారు. ప్రసాదాలను అందజేశారు. మంత్రి నారాయణ, దేవదాయ శాఖ జిల్లా అధికారి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు



మహాశివుడికి విశేష పూజలు



గొబ్బెమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

పాకల తీరంలో ఘోరం

- సముద్రంలో మునిగి ఇద్దరు బాలికలు, యువకుడి మృతి
- రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం
- మిన్నంటిన రోదనలు

ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న చిన్నారులు.. పెళ్లయి ఆర్నెల్లయిన నవ దంపతులు.. కుటుంబసభ్యులు అందరూ కలిసి సంక్రాంతిని వేడుకగా జరుపుకొన్నారు. సేదతీరాలనే ఉద్దేశంతో సముద్ర తీరానికి చేరుకున్నారు. కేరింతలు కొడుతూ.. సముద్ర స్నానాలు చేస్తూ.. ఫొటోలు దిగి తమ ఈ ప్రయాణం జీవితంలో ఓ మధురానుభూతిని మిగిలిస్తుందని కలలుగన్నారు. అయితే విధి ఆడిన వింత నాటకంలో వీరిలో నవ వరుడు.. ఇద్దరు చిన్నారులను కడలి బలిగొంది. ఈ హృదయ విదారక ఘటన సింగరాయకొండ మండలం పాకలలో గురువారం చోటుచేసుకుంది.

కందుకూరు / పొన్నలూరు / సింగరాయకొండ /: సింగరాయకొండ మండలంలోని పాకల తీరం కన్నీటి సంద్రమైంది. సంక్రాంతి సంబరాల్లో ఉత్సాహంగా గడిపి సేదతీరేందుకు సముద్రానికి వెళ్లిన వారిని కడలి బలిగొంది. ఘటనలో ఇద్దరు బాలికలు, ఓ యువకుడు మృతి చెందారు. అప్పటి వరకు కేరింతలు కొట్టిన వారు క్షణాల్లో విగతజీవులవడంతో ఆ కుటుంబాల్లో రోదనలు మిన్నంటాయి.

ఉత్సాహంగా వెళ్లి..

పొన్నలూరు మండలం తిమ్మపాళెం పంచాయతీ శివన్నపాళెం ఎస్సీ కాలనీకి చెందిన శింగయ్య, వరమ్మ దంపతుల కుమారుడు నోసిన మాధవ (25)కు కందుకూరు మండలం అనంతసాగరానికి చెందిన నవ్యతో ఆర్నెల్ల క్రితం వివాహమైంది. హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగించే ఈయన సంక్రాంతి సందర్భంగా గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో సింగరాయకొండ మండలం పాకల బీచ్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. కుటుంబసభ్యులతో పాటు గ్రామంలోని బంధువులు కలిసి టెంపో ఆటోను మాట్లాడుకున్నారు. దారిలో నవ్య చెల్లెలు, తమ్ముడు యామిని, ఫణీంద్రను ఆటోలో ఎక్కించుకున్నారు. మొత్తం 15 మందికిపైగా తీరానికి చేరుకున్నారు. అందరూ సముద్రంలో జలకాలాడుతూ ఉల్లాసంగా గడిపారు. శ్రుతి మించిన ఉత్సాహమే వీరిపాలిట శాపంగా మారింది.

లోతును అంచనా వేయలేక..

ఈ క్రమంలో కొందరు ఇంకా కొంచెం లోతైన ప్రాంతానికి వెళ్లారు. వీరిలో ఐదుగుర్ని అలలు లాక్కెళ్లిపోయాయి. నోసిన మాధవ (25), కొండాబత్తిన యామిని (14), నోసిన జెస్సికా (13) ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు త్రుటిలో బయటపడ్డారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ మృతుల బంధువులు, కుటుంబసభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి.

విషాదఛాయలు

మాధవ, యామిని, జెస్సికా మృతి చెందడంతో శివన్నపాళెం, కొల్లగుంటలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంక్రాంతిని సంతోషంగా జరుపుకొన్న వీరు మృత్యువాత పడటంతో బంధువులు, గ్రామస్తులు రోదిస్తున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి ముందు అందరూ కలిసి తీసుకున్న గ్రూపు ఫొటో (వృత్తాల్లోని వారు మృతులు)

భర్త, చెల్లెల్ని కోల్పోయి..

పొన్నలూరు మండలంలోని విప్పగుంట హైస్కూల్లో తొమ్మిదో తరగతిని యామిని చదువుతున్నారు. అలల ధాటికి కొట్టుకుపోయి ప్రాణాలొదిలారు. దీంతో భర్త, చెల్లెల్ని నవ్య కోల్పోయారు. తన కళ్ల ఎదుటే జరిగిన ప్రమాదంతో ఆమె షాక్‌కు గురయ్యారు.

కళ్లెదుటే జరిగినా నిస్సహాయత

శివన్నపాళేనికి చెందిన మంగయ్య, సువర్ణరాణి కుమార్తె జెస్సికా మాలపాడులోని కేజీబీవీ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. కళ్ల ఎదుటే కుమార్తె కొట్టుకుపోతున్నా, ఏమీ చేయలేని దీనస్థితి వారిది.



రోదిస్తున్న యామిని తల్లి సంపూర్ణ

బాధితులకు పరామర్శ

పాకల బీచ్‌లో మునిగి మరణించిన వారి కుటుంబ సభ్యులను మంత్రి బాలవీరాంజనేయస్వామి, ఎస్పీ దామోదర్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్థానిక ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు.

నాలుగైదు నిమిషాల్లోనే ఘోరం

20 మంది వరకు పాకల సముద్ర తీరానికి వెళ్లాం. మునిగే క్రమంలో బాత్ రూమ్‌కు అని ఒడ్డుకొచ్చాను. వెళ్లేలోపే మాలో కొందరు కొట్టుకుపోయారు. స్థానికంగా ఉండే మత్స్యకారులతో మాట్లాడి బోట్లు వేసుకొని కొట్టుకుపోయిన వారి కోసం వెతికాం. ఆ సమయంలో మృతదేహాలు లభ్యమయ్యాయి. నాలుగైదు నిమిషాల్లోనే ఇంత ఘోరం జరుగుతుందని ఊహించలేదు. – వెంకటేష్, ప్రత్యక్ష సాక్షి

తమ్ముళ్ల మధ్య మద్యం చిచ్చు

- వైన్ షాపు తెచ్చిన తంటా
- తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం
- ఎమ్మెల్యే వద్ద పంచాయితీ

ఉదయగిరి: మండలంలోని గండిపాళెంలో ఈ నెల 11న ఏర్పాటు చేసిన మద్యం దుకాణంపై రాజకీయ రగడ నడుస్తోంది. వాస్తవానికి మండలానికి మంజూరైన మూడు మద్యం దుకాణాలను ఉదయగిరి పట్టణంలో ఏర్పాటు చేశారు. అయితే ఇందులో ఓ షాపులో విక్రయాలు చాలా తక్కువగా ఉండటంతో, గండిపాళెంలో ఏర్పాటు చేసేందుకు యత్నించారు. దీన్ని గ్రామంలో అధికార పార్టీకి చెందిన ఓ వర్గం వ్యతిరేకించగా, మరో వర్గం మాత్రం ఏర్పాటు చేయాల్సిందేనని పట్టుబట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలో గ్రామంలో దుకాణం ఇటీవల వెలిసింది. దీంతో షాపును మూసేయాలంటూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఓ వర్గం ఫిర్యాదు చేసింది. ఆయన సూచనల మేరకు షాపును ఎక్సైజ్ అధికారులు తాత్కాలికంగా మూయించారు. దీంతో ఎమ్మెల్యే వద్ద రెండు వర్గాలు పంచాయితీ పెట్టి నిర్ణయం తీసుకోవాలని పట్టుబడుతున్నారు. మొత్తమ్మీద మద్యం దుకాణ వ్యవహారం అధికార పార్టీలో రాజకీయ రచ్చ రేపింది.



గండిపాళెంలో మూతపడిన మద్యం దుకాణం

అక్రమ లేఅవుట్లను ఉపేక్షించేదిలేదు

- మంత్రి నారాయణ

నెల్లూరు(బారకాసు): అక్రమ లేఅవుట్లు, అక్రమ భవన నిర్మాణాలను ఉపేక్షించేదిలేదని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నుడా, నగరపాలక సంస్థ అధికారులతో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి లేఅవుట్లు వేసినా, భవన నిర్మాణాలు చేపట్టినా వాటిని గుర్తించి తొలగించేందుకు వెనుకాడబోమని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో నూతన సంస్కరణలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. లేఅవుట్లు, భవన నిర్మాణాల విషయమై టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన దాదాపు 18 అంశాల్లో మార్పులు చేసి ప్రజలకు అనుకూలంగా సులభతరం చేశామని తెలిపారు. అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే మంజూరు చేయనున్నామని వివరించారు. 11 ఫైళ్లను పరిశీలించిన అధికారులు కొర్రీలు వేశారని, దీనికి గానూ ఆయా యజమానులను పిలిపించామన్నారు. దరఖాస్తులను పరిశీలించి సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్లో సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకున్నామని పేర్కొన్నారు. సక్రమంగా ఉన్న వాటికే అనుమతులివ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. లేఅవుట్ యజమానులు, వ్యాపారులు అన్ని అనుమతులు పొందితే పన్నులు, జీఎస్టీ తదితరాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ప్రభుత్వ అనుమతులను పొందాల్సిందేనని, ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండదని పేర్కొన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, కమిషనర్ సూర్యతేజ, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, ఆర్డీఓ అనూష, సిటీ ప్లానర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

ఆధ్యాత్మిక శోభితం



ఆలయాలకు నిలయంగా మనుబోలు

- ఒక్కో గుడికి ప్రత్యేక చరిత్ర
- కొన్ని శిథిలావస్థకు చేరిన వైనం

మండల కేంద్రమైన మనుబోలు ఆధ్యాత్మిక నిలయంగా విరాజిల్లుతోంది. సహజంగానే గ్రామంలో భక్తిభావం ఎక్కువ. పది వేల్లోపు జనాభా ఉన్న ఊరిలో 20 దేవాలయాలు ఉండటం విశేషం. ఇందులో మూడు వేల జనాభా ఉన్న పాత ఊరిలోనే 15 గుడులున్నాయి. పడమటి వీధిలో ఉన్న రామాలయంలో నిత్యం భజనలు చేస్తూనే ఉంటారు. 70 ఏళ్లుగా ఇది జరుగుతోంది. గ్రామంలో నాలుగు రామాలయాలు, శివాలయం, విష్ణాలయం, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, వీరభద్రస్వామి, సంగమేశ్వర, ప్రసన్నాంజనేయస్వామి, వినాయకస్వామి, మనుబోలమ్మ, నాగార్పమ్మ, గంగమ్మ ఆలయాలు, సాయిబాబా, వెంకయ్య స్వామి మందిరాలు, పోలేరమ్మ ఆలయం, మాతమ్మ ఆలయాలున్నాయి.

– మనుబోలు


పురాతన విష్ణాలయం

చరిత్ర ఇలా..

విష్ణాలయాన్ని 12 శతాబ్దంలో నిర్మించినట్లు చెబుతారు. కండలేరు ఒడ్డున ఉన్న సంగమేశ్వర ఆలయానికి సంబంధించి పెద్దలు ఈ విధంగా వెల్లడిస్తుంటారు. పరశురాముడు తల్లిని సంహరించిన అనంతరం పాప ప్రక్షాళన కోసం దేశంలో ఎన్నో శైవ క్షేత్రాలను నిర్మించాడు. అయినా పాప పరిహారం జరగకపోవడంతో ఆయన తండ్రి, గురువు అయిన జమదగ్ని మహర్షి ఆజ్ఞ మేరకు చివరగా మనుబోలు సమీపంలోని కండలేరు ఒడ్డున సంగమేశ్వరాలయాన్ని నిర్మించాడు. తూర్పు ముఖ ద్వారంతో ఉన్న ఈ గుడిలో వెలుపలకు వెళ్లే మార్గం దక్షిణం వైపు ఉంటుంది. వచ్చి వెళ్లే మార్గాలు వేరుగా ఉండటంతో భక్తుల పాప ఫలాలు అక్కడే ఆగిపోతాయని అనాదిగా వస్తున్న నమ్మకం. ఏటా ఏప్రిల్‌లో నిర్వహించే సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని తిలకించేందుకు ఎంతోమంది భక్తులు తరలివస్తారు. 20 అడుగులు ఎత్తున్న స్వామి రథాన్ని మనుబోలు శివాలయం నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంగమేశ్వరాలయానికి భక్తులు తమ భుజాలపై మోసుకెళ్లి తీసుకురావడం ప్రత్యేకత.

స్పందిస్తే..

కొన్ని ఆలయాలు శతాబ్దాల క్రితం నిర్మించినవి కావడంతో కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకున్నాయి. గ్రామం నడిబొడ్డున ఉన్న పురాతన శ్రీదేవి, భూదేవి సమేత విష్ణాలయంతోపాటు కుడి చెరువు గట్టున ఉన్న శివాలయం, కండలేరు ఒడ్డున ఉన్న సంగమేశ్వరాలయం, దళితవాడలోని చెన్నకేశవాలయం శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వం, దాతలు స్పందించి మరమ్మతులు చేయించాలని అర్చకులు, గ్రామస్తులు కోరుతున్నారు.


శివాలయం


మనుబోలమ్మ దేవాలయం


సంగమేశ్వరాలయం


వీరభద్రుని ఆలయం

ఉత్సవాలను ఆపలేదు



గ్రామంలో భక్తిభావం, ఆధ్యాత్మిక చైతన్యం ఎక్కువ. కరువు కాటకాలు, ఉపద్రవాలు ఎదురైనా ఆయా ఆలయాలకు సంబంధించి ఏటా నిర్వహించే ఉత్సవాలను ఎప్పుడూ ఆపింది లేదు. – మారంరెడ్డి రాజారామిరెడ్డి

పూర్వ వైభవం తేవాలి



ఎంతో చరిత్ర ఉన్న ఆలయాలు కొన్ని నేడు శిథిలావస్థకు చేరుకుని ఆదరణ కరువైన వైనం చూస్తుంటే బాధ వేస్తోంది. కొన్ని ఆలయాలకు ఆదాయం లేకపోవడంతో ధూప దీప నైవేద్యాలు పెట్టేందుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి ఆలయాలకు పూర్వ వైభవం తేవాలి. – దుగ్గన రామచంద్రయ్య



శిథిలమైన సమాచార కేంద్రం

అంతులేని నిర్లక్ష్యం

- సమీపిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్ - 2025
- దుస్థితిలో పక్షుల సమాచార కేంద్రం
- మద్యం తాగే కేంద్రాలుగా మారిన బర్డ్స్ వ్యూ పాయింట్లు
- పట్టించుకోని వైల్డ్ లైఫ్ సిబ్బంది

సూళ్లూరుపేట: ఓ వైపు ఫ్లెమింగో ఫెస్టివల్ సమీపిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం దారుణంగా ఉన్నాయి. సూళ్లూరుపేట – శ్రీహరికోట మార్గంలో కుదిరి వద్ద ఏర్పాటు చేసి పక్షుల సమాచారం కేంద్రం పనిచేసి కొన్ని సంవత్సరాలైంది. పక్షుల సమాచారం కేంద్రంలో సమాచారం ఇచ్చే సిబ్బంది లేకపోవడంతో ఈ భవనం పూర్తిగా శిథిలమైపోయింది. దీంతో ఈ భవనం మద్యం తాగేందుకు, పేకాట ఆడేందుకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. విదేశీ వలస విహంగాలు విడిది చేసిన దృశ్యాలను తిలకించేందుకు పులికాట్ వన్యప్రాణి సంరక్షణా విభాగం వారు అక్కడక్కడా గ్రానైట్ రాళ్లతో బెంచీలు ఏర్పాటు చేశారు. ఎండ తగలకుండా నీడను కల్పించేందుకు శ్రీహరికోట రాకెట్ కేంద్రం వారు రేకుల షెడ్లు కట్టించారు. అదేవిధంగా కుదిరి – అటకానితిప్పకు మధ్య బర్డ్స్ వాచ్ టవర్‌ను కూడా ఏర్పాటు చేశారు. అయితే వైల్డ్‌లైఫ్ వారి పర్యవేక్షణ పూర్తిగా కొరవడడంతో వీటిని మందుబాబులు బార్లుగా ఉపయోగించుకుంటున్నారు. వ్యూ పాయింట్లలో బెంచ్‌లను పగులగొట్టి నిలబడేందుకు కూడా వీల్లేకుండా తయారు చేశారు.

మరమ్మతులు చేయకుండా..

సూళ్లూరుపేట – శ్రీహరికోటకు మధ్యలో ఉన్న అటకానితిప్పలో వైల్డ్ లైఫ్ వారు పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని సందర్శించేందుకు వచ్చే పర్యాటకులు వ్యూ పాయింట్ల వద్ద కూర్చుని పక్షులను వీక్షిస్తుంటారు. పులికాట్ సరస్సుకు ఈ సీజన్‌లో సుమారు 152 రకాల విదేశీ, స్వదేశీ విహంగాలు వచ్చాయి. వీటిని వీక్షించేందుకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు ఇక్కడకు విచ్చేస్తుంటారు. ఈనెల 18, 19, 20 తేదీల్లో ఫ్లెమింగో ఫెస్టివల్ – 2025 నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ ఈ వ్యూ పాయింట్లకు మరమ్మతులు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.


ఇష్టారాజ్యంగా..

సూళ్లూరుపేట కేంద్రంగా నడుస్తున్న వైల్డ్ లైఫ్‌లో సిబ్బంది కొరత పీడిస్తోంది. బీట్ ఆఫీసర్లుగా వేసిన వారు అక్కడకు వెళ్లి విధులు చేయకుండా సైడ్ బిజినెస్‌లలో లీనమైపోయారు. ఇక్కడ ఒక డీఎఫ్ఓ, రేంజర్ అధికారి ఉండి కూడా ఉపయోగం లేకుండా పోయిందనే విమర్శలున్నాయి. ఈ రెండు పోస్టులను దూర ప్రాంతాలకు చెందిన వారిని పంపిస్తుడటంతో వారు ఏదో విజిట్‌కు వచ్చినట్టు వచ్చి వెళ్తున్నారు. కింది స్థాయి సిబ్బంది కూడా సక్రమంగా విధులు నిర్వహించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పులికాట్ సరస్సుకు భద్రత కోసం ఏర్పాటు చేసిన వైల్డ్ లైఫ్ శాఖ నామమాత్రంగా మారింది. సరస్సులో గుల్ల తీసేయడం, వానపాములను తవ్వేయడం వంటి కార్యకలాపాలపై నిఘా కొరవడింది. గుల్ల తవ్వకాలు, వానపాములు తవ్వకాల్లో ఇంటి దొంగల పాత్ర ఎక్కువైపోవడంతో దీన్ని నిరోధించలేకపోతున్నారనే ఆరోపణలున్నాయి. గతంలోలా దాడులు చేయడం కూడా పూర్తిగా మరిచిపోయారు. ఇదిలాగే కొనసాగితే భవిష్యత్ తరాల వారికి పులికాట్ సరస్సును, ఇక్కడకొచ్చే విదేశీ వలస విహంగాలను మ్యాప్‌ల్లో చూపించాల్సిన పరిస్థితులు ఏర్పడే అవకాశం లేకపోలేదు.



అటకానితిప్ప – శ్రీహరికోటకు మధ్యలో పిచ్చిమొక్కలతో నిండిన బర్డ్స్ వ్యూ పాయింట్


కుదిరి – అటకానితిప్పకు మధ్యలో బర్డ్స్ వ్యూ పాయింట్‌లో బెంచీలిలా..



నిరుపయోగంగా వాచ్ టవర్

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

- ఎక్కడ చూసినా అవినీతి, దౌర్జన్యాలు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: 'కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం. అన్నదాతలు దగా పడ్డారు. చంద్రబాబుకు ఓట్లు వేసి మోసపోయారు' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నేదురుమల్లి, వెలికంటిపాళెం, శాంతినగర్, పులికల్లు గ్రామాల్లో గురువారం కాకాణి పర్యటించారు. ఈ సందర్భంగా తనను కలిసిన గ్రామస్తులు కూటమికి ఓట్లు వేసి మోసపోయామని, ఏ ఒక్క పథకం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడా చూసినా అవినీతి, దౌర్జన్యాలు రాజ్యమేలుతున్నాయని, అభివృద్ధి ఊసే లేదన్నారు. ఇరిగేషన్ పనుల్లో సోమిరెడ్డి అవినీతికి పాల్పడినట్టు ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణ జరిపించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారుల తీరు మారలేదని, ఈ పర్యాయం కఠినంగా వ్యవహరించి తిన్న ప్రజల సొమ్ము కక్కించడం జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ పేరిట చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలు గుర్తుచేసుకుని బాధపడుతున్నట్టు తెలిపారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కూటమి ప్రభుత్వానికి పది సీట్లు కూడా రావన్నారు. తమ హయాంలో మారుమూల గ్రామాలు కూడా అభివృద్ధి చెందాయన్నారు. అధికారం ఉన్నా లేకున్నా జనం మధ్య ఉంటానన్నారు. నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండి ఆదుకుంటానని తెలిపారు. వైఎస్సార్‌సీపీని జిల్లాలో తిరుగులేని శక్తిగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. నాగయ్యనాయుడు, బాలిరెడ్డి, వెంకటరమణయ్యగౌడ్, ఎంపీటీసీ సుగుణమ్మ కుటుంబసభ్యులు ఇటీవల మృతిచెందడంతో కాకాణి వారి గృహాలకు వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పెంచలనాయుడు, మల్లారెడ్డి, వెంకటరమణయ్యనాయుడు, డి.వెంకటరమణారెడ్డి, వై.పెంచలరెడ్డి, చంద్రమౌళి, ఆకుల లక్ష్మి, జనార్దనరెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి, స్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.


పులికల్లులో నాయకులతో మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

కండలేరులో 55.952 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 55.952 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 900, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	127
లేయర్ (లైవ్) :	88
బ్రాయిలర్ చికెన్ :	230
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	254
లేయర్ చికెన్ :	150



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి :	రూ.39
సన్నవి :	రూ.28
పండ్లు :	రూ.18



వ్యక్తిపై పిచ్చికుక్క దాడి

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీలో నలగర్ల వెంకరమణయ్య అనే వ్యక్తిపై గురువారం పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో కుటుంబసభ్యులు ఆయన్ను వెంటనే నెల్లూరుకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. గ్రామంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ పంచాయతీ పరిధిలోని గొట్లపాళెం, మంగళంపాడు, కంద్రిగ దళితవాడలో కొన్ని రోజుల వ్యవధిలో పిచ్చికుక్కల దాడిలో పదిమందికి పైగా గాయపడ్డారు. గొట్లపాళేనికి చెందిన పచ్చబట్ల రత్నయ్య (70) అనే వృద్ధుడు పిచ్చికుక్కల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాలుగు రోజుల క్రితం మృతిచెందాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

ఆదిలక్ష్మీదేవికి వనమహోత్సవం


విశేషాలంకరణలో ఆదిలక్ష్మీదేవి


అమ్మవారికి ఉత్సవం

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఆదిలక్ష్మీదేవి అమ్మవారికి గురువారం శ్రీవారి నందనవనంలో వనమహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి తర్వాత వచ్చే ముక్కనుమ నాడు వనమహోత్సవం నిర్వహించడం ఈ క్షేత్రం ఆచారమని దేవస్థాన ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి తెలిపారు. ఆదిలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం నందనవనం (తోట)లోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు, ఆస్థాన సేవ నిర్వహించారు. అమ్మవారి పూజ, ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు విచ్చేశారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసుల నమోదు

- రూ.14.22 లక్షల జరిమానా

నెల్లూరు(టౌన్): సంక్రాంతి సందర్భంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై జిల్లా రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. జాతీయ రహదారిపై వారం రోజులుగా తనిఖీలు చేసి అధిక చార్జీల వసూలు, పర్మిట్ లేకపోవడం, త్రైమాసిక పన్ను చెల్లించకపోవడం తదితర వాటికి సంబంధించి బస్సులపై 84 కేసులు నమోదు చేశారు. రూ.14.22 లక్షలు అపరాధరుసుము విధించారు. మరో నాలుగు రోజులపాటు తనిఖీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీటీసీ సిరిచందన గురువారం తెలిపారు. తనిఖీల్లో ఎంవీఐలు బాలమురళీకృష్ణ, కార్తీక్, రఫీ, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నీల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీల్లో పాల్గొన్న అధికారులు